## క్లుప్తంగా

### నేడు ఆధార్ శిబిరాలు

నాతవరం: మండలంలో బుధవారం సరుగుడు, పెదగొలుగొండపేట గ్రామ సచివాలయాలు వద్ద ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశామని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరాల్లో ఆధార్ కార్డులో ఎలాంటి లోపాలు ఉన్నా సరి చేసుకోవాలన్నారు. ఈ అవకాశం మరలా ఎప్పుడు వస్తుందో తెలియదని అయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఘనంగా తలుపులమ్మ తల్లి పండగ

నాతవరం : మండలంలో పి.జగ్గంపేట గ్రామంలో వెలసిన తలుపులమ్మ తల్లి పండగను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కు లు చెల్లించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పండగ సందర్భంగా సాయంత్రం భజనలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

### ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


సింగన్నదొరపాలెంలో ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్న వైద్యాధికారి చైతన్య

కె.కోటపాడు : మహిళలు సంపూర్ణ ఆరోగ్యం కోసం తగు జాగ్రత్తలు పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య అన్నారు. సింగన్నదొరపాలెం గ్రామంలో మంగళవారం స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంను జరిపారు. 129 మంది మహిళలకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు గుండె వ్యాధులు, మధుమేహం, నోటి, గర్భాశయ క్యాన్సర్‌లపై నిర్ధారిత పరీక్షలు జరిపి మందు లు ఇచ్చారు. ఎంపీహెచ్‌ఈవో జె.సన్యాసిరావు పాల్గొన్నారు.

### రేపు రాచపల్లిలో గ్రామసభ

మాకవరపాలెం : ఈ నెల 25న రాచపల్లిలో బంజరు సాగుదారుల ఎంపికపై అభ్యంతరాల స్వీకరణకు గ్రామసభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. రాచపల్లి రెవెన్యూలోని 737లో గత 40 ఏళ్లకుపైగా బంజరు భూములను సాగు చేసుకుంటున్న రైతుల వివరాలను ఇటీవల సర్వే చేసి రెవెన్యూ అధికారులు జాబితాలు సిద్ధం చేశా రు. ఈ నేపథ్యంలో అభ్యంతరాల స్వీకరణకు గురువారం ఉదయం 10 గంటలకు సచివాలయం వద్ద గ్రామసభ ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ మంగళవారం తెలిపారు. ఈ సభకు రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రజలు హాజరై సర్వే ద్వారా గుర్తించిన సాగుదారుల జాబితాల్లో అభ్యంతరాలను తెలపాలన్నారు.

### రేపు సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

మాడుగుల రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధ, గురువారాల్లో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీపీ తాళ్ల పురెడ్డి వెంకటరాజారామ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్.జి.యస్.ఎ. కార్యాచరణ ప్రణాళిక 2025-26లో భాగంగా, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై శిక్షణ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆయన కోరారు.

### 7న తాండవలో నల్లగొండమ్మ తల్లి పండగ


తాండవ ప్రాజెక్టు గట్టు దిగువనున్న నల్లగొండమ్మ తల్లి ఆలయం

నాతవరం : తాండవ రిజర్వాయరు గట్టు దిగువనున్న నల్లగొండమ్మ తల్లి పండగను వచ్చే నెల 7వ తేదీన జరపాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. మంగళవారం మాధవనగరం, గంటావారి కొత్త గూడెం, తాండవ గ్రామాలకు చెందిన గ్రామపెద్దలు, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. అందరి అభీష్టం మేరకు అక్టోబరు 7వ తేదీన పండగ జరపాలని ముహూర్తం ఖరారు చేశామని గ్రామపెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఘనంగా ఏర్పాట్లు చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

### నెలాఖరులోగా పి-4 సర్వేను పూర్తి చేయాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి : పి-4 సర్వేను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో సువర్ణరాజు సచివాలయ సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పి-4 సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న వారి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానంపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఏకధాటి వర్షాలతో వరి నాట్లకు ఊపిరి

గెడ్డలు, చెరువుల్లో నిండుగా నీళ్లు
7వేల ఎకరాల్లో నాట్లు


ఎర్రవరం వద్ద చెరువులో నిండుగా నీరు


ధారకొండ దిగువన కొత్తపాలెం వద్ద కళకళలాడుతున్న వరిసాగు

గొలుగొండ : వరి సాగు కళకళలాడుతుంది. మండలంలో నీటి వనరులు అధికంగా ఉండడంతో ఈ ఏడాది నూరుశాతం నాట్లు వేయడం జరిగింది. నర్సీపట్నం డివిజన్ పరిధిలో ప్రతీ ఏటా ముందుగానే గొలుగొండ మండలంలో నాట్లు వేస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ మొదట్లో తీవ్ర వర్షాభావ పరిస్థితిల్లో కూడా గొలుగొండంలో నాట్లు ముందుగానే జరిగాయి. వాతావరణం అనుకూలంగా లేకపోయినా నీటి వనరులు ఉండడంత రైతులు జులై రెండో వారంలోనే నాట్లు వేయడం జరిగింది.

**కళకళలాడుతున్న వరి**

జిల్లాలోనే గొలుగొండ మండలంలో జులై రెండు వారంలో నాట్లు వేయడంలో వేసిన పంట కళకళలాడుతుంది. ప్రతి ఏటా ఈ మండలంలో నాట్లు వేయడంలో రైతులకు గెడ్డలు అనుకూలంగా ఉంటాయి. ధారగెడ్డ ప్రాంతంపై ఆధారపడి ఉన్న బొడ్డేరు, ధారగెడ్డ, బోరింగ్‌గెడ్డ, గొర్రిగెడ్డలు ఆదారపడి ఉన్నాయి. ప్రతి ఏటా ఖరీఫ్‌కు అనుకూల వాతావరణం రావడంతో ధారకొండపై ఏ మాత్రం వర్షం కురిసిన ఈ వర్షం నీరు ప్రవహించి గెడ్డల ద్వారా పంట పొలాలకు మేలు జరుగుతుంది. ముందుగానే నాట్లు వేయడంతోనే ప్రస్తుతం నాట్లు ఎంతో కళకళలాడుతున్నాయి.

**7వేల ఎకరాల్లో పంటలు**

మండలంలో ధారకొండ దిగువన ఉన్న ధారగెడ్డ, బోరింగ్‌గెడ్డ, గొర్రి గెడ్డ దిగువన 2వేల ఎకరాల్లో నాట్లు జరిగాయి. కృష్ణదేవిపేట సమీపం నుండి ప్రవహిస్తున్న బొడ్డేరు గెడ్డ నుంచి ప్రవహిస్తున్న నీరు విప్పలపాలెం వద్ద ఉన్న ఆయకట్టు దిగువన ఉన్న చెక్‌డ్యామ్ నుంచి మరో 1500 ఎకరాల్లో నాట్లు జరిగాయి. అలాగే ఏటిగైరంపేట, రవాణాపల్లి జలాశయం దిగువన ఉన్న రవాణాపల్లి జలాశయం నుండి గొలుగొండ, నర్సీపట్నం మండలాలకు చెందిన సాగు భూములకు మరో 1800 ఎకరాల్లో నాట్లు జరిగాయి. ముందుగానే అన్ని ప్రాంతాల్లో నాట్లు పూర్తి కావడంతో ప్రస్తుతం వరి సాగు ఎంతో కళకళలాడుతుంది.అలాగే చెరువులు, మెరక ప్రాంతాల్లో చిన్నచిన్న నీటి వనరులు కలిపి అన్ని ప్రాంతాల్లో నాట్లకు ఢోకా లేదని రైతులు అంటున్నారు.

**కలుపుతీత పనుల్లో రైతులు బిజీబిజీ**

వరి సాగు మండలంలో ముందుగా వేయడంతో కలుపుతీత పనులు పూర్తి చేయడం జరిగింది. రెండు దఫాల ఎరువులు, పురుగు మందులు కూడా పిచికారి చేసినట్లు రైతులు తెలుపుతున్నారు. విప్పలపాలెం, అయ్యన్నపాలెం, చీడిగుమ్మల, ఎర్రవరం , గొలుగొండ ప్రాంతాల్లో అక్కడక్కడ కలుపుతీత పనులు చేయడం జరుగుతుంది. ప్రస్తుతం పంట ఏపుగా పెంచేందుకు రైతులు ఎరువులు, పురుగు మందులు పిచికారి చేస్తున్నారు.

**అనుకూలంగా వాతావరణం**



వరి సాగుకు మా ప్రాంతంలో ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉంది. ఎకరం భూమిలో వరి సాగు చేస్తున్నాను. ప్రస్తుతం కలుపు తీత, పురుగుమందులు పిచికారి చేయడం జరిగింది. ముందుగానే నాట్లు వేయడంతో వరి కళకళలాడుతుంది. వరితోపాటు కూరగాయల సాగు కూడా చేపడుతున్నాను.

– పడవాడ నాయుడు, రైతు,లింగంపేట

## రామకృష్ణ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


రామకృష్ణతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ : కొత్త ఎల్లవరంకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అల్లు రామకృష్ణతో పాటు కుటుంబ సభ్యులను నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంగళవారం పరామర్శించారు. విశాఖలో చదువుతున్న అల్లు రామకృష్ణ కుమారుడు రామ్‌చరణ్ నెల రోజుల నుంచి కనిపించకపోవడంతో అన్ని ప్రాంతాల్లో వెతికారు. అయినా కుమారుడి జాడ తెలియక రామకృష్ణ తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తో పాటు జెడ్పీటీసీ సభ్యుడు సుర్ల గిరిబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొరుప్రోలు పాణీశాంతారామ్, పార్టీ నాయకులు లెక్కల సత్యనారాయణ, మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, విప్పలపాలెం, కొమిర సర్పంచ్‌లు నల్లబెల్లి శ్రీనువాస్, అల్లు రాజుబాబుతో పాటు యాళ్ల నాయుడు, జోగు రామకృష్ణ, కొల్లు అప్పలనాయుడు పరామర్శించి ధైర్యం చెప్పారు.

## జీతాలు పెంచమంటే పనిగంటలు పెంచారు..


మున్సిపల్ స్టేడియం గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న స్కీం వర్కర్లు

నర్సీపట్నం : వేతనాలు పెంచమంటే పని గంటలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా దుర్మార్గమని సీఐటీయు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పేర్కొన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, దినసరి వర్కర్లు, వివిధ సంస్థల్లో పని చేస్తున్న స్కీం వర్కర్లు మంగళవారం మున్సిపల్ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో తీవ్రమైన పని భారంతో పని చేస్తున్నారన్నారు. కార్మిక చట్టాలు, కార్మిక హక్కులు అమలు చేయాలన్నారు. కార్మికశాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌కు లోబడి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా పని గంటలను 8 గంటల నుంచి 13 గంటలకు పెంచిందన్నారు. కార్మికులను కార్పొరేట్, ప్రైవేటు యాజమాన్యాల దోపిడీకి బలి చేస్తోందన్నారు. తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి మహాలక్ష్మి, ఆశా మండల నాయకులు అరుణ, ముఠా నాయకుడు కె.సాంబ, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఐద్వా జిల్లా ట్రెజరర్ కె.వి.సూర్యప్రభ పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి యూపీ అదనపు డీజీపీ పుస్తకాల వితరణ


గ్రంథాలయ అధికారికి పుస్తకాలు అందజేస్తున్న టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు

నర్సీపట్నం : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం యూపీ అదనపు డీజీపీ కిల్లాడ సత్యనారాయణ(ఐపీఎస్) గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ చేశారు. ఈ పుస్తకాలను నర్సీపట్నం టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు గ్రంథాలయ అధికారి దమయంతికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అదనపు డీజీపీ కల్పించిన అవకాశాన్ని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎటువంటి సహాయం కావాలన్న తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.రాము, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి.ప్రభాకర్, పాఠకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మి కుంకుమ పూజలు


కె.జె.పురం కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు


వంటర్లపాలెం కనక దుర్గమ్మ ఆలయంలో..

మాడుగుల రూరల్: జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అష్టలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు ఈ పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు తెలిపారు. అలాగే వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున్న గల కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారిని గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. వీరనారాయణం గ్రామంలో రామాలయం, గౌరీశ్వర ఆలయాల్లో వేరు వేరు చోట్ల అమ్మవార్లను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు.

## మాతృత్వ వందన యోజనపై అవగాహన


మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు

రావికమతం : టి.అర్జాపురం గ్రామంలో మంగళవారం స్వస్థ్ నారీ, సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ అధ్వర్యంలో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంపూర్ణ పోషణ ఆవశ్యకతను తెలియజేసేలా అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన వివిధ రకాల వంటకాలు ప్రదర్శించారు. బాల సంజీవిని కిట్ ద్వారా వచ్చే పోషకాలు గురించి మేడివాడ సెక్టార్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి తెలియజేశారు.

## ప్రత్యేక ఉపాధ్యాయులకు అభినందన


ప్రశంసా పత్రం అందుకుంటున్న ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు

రావికమతం : మండలంలో దివ్యాంగ విద్యార్థుల విద్యాభివృద్ధికి, దివ్యాంగులకు విశేష సేవలు అందించిన మేడివాడ హైస్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు బి. మహాలక్ష్మినాయుడు, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు జి.జగన్నాథనాయుడులను కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వినీత్ సింఘాల్, జాతీయ మేధో వైకల్య దివ్యాంగుల సాధికారిత సంస్థ(సికింద్రాబాద్) డైరెక్టర్ డాక్టర్ బి.బి.రామ్‌కుమార్ చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రం అందించి అభినందించారు. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజేబులిటీస్, ఆంధ్రా యూనివర్శిటీ విద్యా విభాగంలో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించారు.

## ప్రణాళికాబద్ధంగా చదవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి వినోద్‌బాబు

కె.కోటపాడు : ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియట్ దశ కీలకమని, క్రమశిక్షణతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని అనకాపల్లి జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎం.వినోద్‌బాబు అన్నారు. కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఇంతవరకూ బోధించిన పాఠ్యాంశాల గురించి ఉపాధ్యాయులను ఆరా తీశారు. ప్రతి విద్యార్థిపైనా శ్రద్ధ చూపి శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక అయ్యన్న జూనియర్ కళాశాలను కూడా వినోద్‌బాబు సందర్శించారు. విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ ఖాసిమ్, నూర్జహన్ పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో భారీ వర్షం


కె.కోటపాడులో కురుస్తున్న వర్షం


రోలుగుంటలో జలమయమైన వీధులు

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. ఇటీవల వేసిన ఖరీఫ్ వరినాట్లుకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షాలకు సాగునీటి చెరువుల్లోనికి పెద్ద ఎత్తున వర్షపునీరు చేరుకుంది. కె.కోటపాడు, చౌడువాడ, ఎ.కోడూరు, ఆనందపురం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.


రోలుగుంట: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం పడింది. దీంతో పల్లపు ప్రాంత వీధులు పూర్తిగా జలమయం కావడంతో ఆయా వీధుల్లో జనం ఇబ్బందులు పడ్డారు. కాలువల్లో పూడికలు తీయించపోవడం వల్ల వర్షం పడినప్పుడల్లా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మదుములను పూర్తిస్థాయిలో మట్టిని తొలగించి నీరు పోయే మార్గం ఏర్పాటు చేసి నీటి ముంపు కష్టాలు తప్పించాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

మాడుగుల రూరల్: అల్పపీడన ప్రభావం వల్ల మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం ఖరీఫ్ వరినాట్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుదని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తాచేరు, శారదనది, పాలగెడ్డ, చింతగెడ్డ పొంగి ప్రవహిస్తున్నాయి. మూడు రోజులుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు త్రీవమైన ఎండ, ఆనంతరం వర్షం కురుస్తుంది. వర్షం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

మాడుగుల: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. పలు చోట్ల వరి నాట్లు నీట మునిగాయి. పెద్దేరు జలాశయానికి 400 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో అంతే వరద నీరు ప్రధాన గేటు ద్వారా విడుదల చేస్తున్నారు. దీంతో పెద్దేరు నది, ఏటి బాధిత ప్రాంతాల రైతులు పెద్దేరులో దిగరాదని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వడ్డాది వద్ద పెద్దేరు నదిపై నిర్మాణం చేపట్టిన కాజ్‌వే నుంచి వాహన చోదకులు దిగరాదని ఏ సమయంలోనైనా కాజ్‌వే పై నుంచి వరద నీరు ప్రవహిస్తుందని తెలిపారు.

## గాయత్రిదేవి అవతారంలో అమ్మవారు


గాయత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గాదేవి


మాడుగులలో గాయత్రీ దేవి అవతారంలో దేవీతల్లి


కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి గాజులతో అలంకరణ


రంగురంగుల గాజులతో ప్రత్యేక పూల దండలతో గాయత్రిదేవి అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

నర్సీపట్నం: శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గాయత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో సామూహిక పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాడుగుల: శరన్న నవరాత్రి ఉత్సవాలులో భాగంగా మాడుగులలో వెలసిన దేవీతల్లి మంగళవారం గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అవతారంలో అమ్మవారిని దర్శించుకున్నవారికి అనున్న పనులులో విజయం సాధిస్తారని ఈ ప్రాంత భక్తులు విశ్వాసం. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంకాలం ఏర్పాటు చేసిన మహిళ కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రావికమతం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కొత్తకోటలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గమ్మను గాజులతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేపా రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చోడవరం: చోడవరం దుర్గాదేవి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. మంగళవారం రంగురంగుల గాజులతో ప్రత్యేక పూల దండలతో శ్రీ గాయత్రి మాత అలంకరణలో దుర్గాదేవి అమ్మవారిని అలంకరించారు. శరణుగోషతో భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## 151 మందికి ఉచిత వైద్య పరీక్షలు


నాగయ్యపేటలో వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి వనజ

దేవరాపల్లి : నాగయ్యపేటలో స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వనజ, ఆయుర్వేద వైద్యాధికారి జి.గ్రీష్మ 151 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. స్థానిక గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ వైద్య శిబిరంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

మాకవరపాలెం: ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ చదివేందుకు అక్టోబర్ 31 వరకు గడువు పెంచినట్టు ఎంఈవో మూర్తి తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఇప్పటికే గడువు పూర్తయిందన్నారు. అయితే ఓపెన్ స్కూల్ సొసైటీ ఈ గడువును వచ్చే నెల 31 వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నా రు. రూ.200 అపరాధ రుసుము చెల్లించి చేరాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పలు గ్రామాల్లో గాలికుంటు టీకాలు


యడ్లవానిపాలెంలో పశువుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి సింహాచలంనాయుడు


ఎం.అలమండ పశువైద్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీ దినేష్‌కుమార్

కె.కోటపాడు : మూడు నెలల వయస్సు దాటిన ప్రతి పశువుకూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు పాడి రైతులకు సూచించారు. యడ్లవానిపాలెం, వారాడ, చిరికివానిపాలెం, ఆర్.వై.అగ్రహారం గ్రామాల్లో గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమం ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకూ నిర్వహించనున్నట్టు తెలిపారు. కొరువాడ పశువైద్యకేంద్రం పరిధిలో ఇప్పటి వరకూ 1545 పశువులకు టీకాలు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు మంగ, సుధారాణి, హనుమంతు, మల్లయ్య, హిప్సిబా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : గాలి కుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని కె.కోటపాడు పశు సంవర్ధకశాఖ ఏడీ ఈ.దినేష్‌కుమార్ సూచించారు. మండలంలోని కె.ఎం.పాలెం శివారు యండపల్లిపాలెంలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎం.అలమండ పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.

## వరిపంటకు సుడిదోమ


పైడిపాలలో సుడిదోమ ఆశించిన వరిపంట

మాకవరపాలెం: మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1400 హెక్టార్లలో రైతులు వరిపంట సాగు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు, గాలిలో అధికతేమ నేపథ్యంలో పైడిపాల, పాపయ్యపాలెం, ముషిడిపాలెం, బూరుగుపాలెం, పీపీ అగ్రహారం, మాకవరపాలెం, తదితర గ్రామాల్లో వరి పంటకు సుడిదోమ ఆశించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సుడిదోమ నివారణకు పొలంలో ఉన్న నీటిని పూర్తిగా తొలగించి, పొలాన్ని ఆరబెట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. యూరియా వాడకాన్ని తాత్కాలికంగా మానుకోవాలన్నారు. దీంతోపాటు ఎసిఫేట్, పైమెట్రిజిన్, బుప్రిజిన్, మందులను పిచికారీ చేసుకోవాలని ఏవో అప్పారావు సూచించారు.